
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
3
మంగళవారం 27 ఫిబ్రవరి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.130	210	230
సూర్యాపేట	రూ.160	230	260
నల్లగొండ	రూ.125	180	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.5 । కనిష్ఠం 24.0

రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ హర్షదాయకం



రేల్వేస్టేషన్ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపి బడుగుల లింగయ్య

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 26 : కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో రాష్ట్రంలో రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ చేపట్టడం హర్షదాయకమని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ కోరారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. సోమవారం దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు సంబంధించి ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా పనులను ప్రారంభించారు. నల్లగొండ రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీ హాజరై ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన కార్యక్రమాన్ని తిలకించి, మాట్లాడారు. రైల్వేస్టేషన్లలో సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు అన్నివసతులను ఏర్పాటుచేయాలన్నారు. జిల్లా ప్రజల తరుపున కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశంలోనే 554 రైల్వేస్టేషన్లను పునర్నిర్మించే ప్రక్రియను ప్రారంభించారని, దేశవ్యాప్తంగా రైల్వే సెక్టార్‌ను బ్రహ్మాండంగా అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రైల్వే సీడీఎం ప్రదీప్ కుమార్, పీడబ్ల్యూఐ రామభద్రరావు, స్టేషన్ మేనేజర్ సుధాకర్‌బాబు, కమర్షియల్ సూపరింటెండెంట్ దేవ్‌సింగ్, బీజేపీ నాయకులు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పోతెపాక సాంబయ్య, యాదగిరిచారి, పోతెపాక లింగస్వామి పాల్గొన్నారు.

అమృత్ భారత్ స్టేషన్లలో సకల వసతులు

మిర్యాలగూడ టౌన్ : అమృత్ భారత్ స్టేషన్లలో సకల వసతులు కల్పించడమే లక్ష్యమని రైల్వే డివిజనల్ ఇంజనీర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా మిర్యాలగూడలలో అభివృద్ధి పనులను ప్రధాని మోదీ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డిలు మాట్లాడుతూ ఈ రైల్‌మార్గంలో అత్యధిక ఆదాయం వస్తుందని, ప్రయాణికులతో పాటు పారిశ్రామిక వేత్తలకు అవసరమైన అదనపు వసతులు సమకూర్చాలని కోరారు. ప్రారంభ కార్యక్రమానికి ప్రముఖులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ తారకేశ్వరరావు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో చిద్విలాసిని ప్రతిభ

ఉమ్మడి జిల్లా పాఠశాల స్థాయి ఛాంపియన్



చిద్విలాసినిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 26 : ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీల్లో చైతన్య పాఠశాల విద్యార్థిని కుమ్మరికుంట్ల చిద్విలాసిని ఛాంపియన్‌గా నిలిచింది. ఈ నెల 25న కోదాడలో రాష్ట్ర చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా పాఠశాలల స్థాయి ఓపెన్ కేటగిరిలో 8వ తరగతి చదువుతున్న చిద్విలాసిని ఛాంపియన్‌గా నిలిచింది. ఈ పోటీల్లో 200 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. సోమవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ జయం తినర్సిరెడ్డి, లైబ్రేరియన్ సుధాకర్ విద్యార్థిని అభినందించారు.

బాక్సింగ్ ఛాంపియన్‌గా ఫరిహా



చాంపియన్‌షిప్ సర్టిఫికెట్ అందుకుంటున్న చిన్నారి ఫరిహా

మిర్యాగూడ : సబ్‌జూనియర్ బాక్సింగ్‌లో మిర్యాలగూడకు చెందిన విద్యార్థిని ఫరిహా సిల్వర్ మెడల్ సాధించింది. తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్(టీబీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన 3వ సబ్‌జూనియర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 300 మంది పాల్గొన్నారు. మిర్యాలగూడ కేంద్రీయ విద్యాలయానికి చెందిన 7వ తరగతి విద్యార్థిని ఫరిహా 46-49 వెయిట్ కేటగిరిలో సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా టీబీఎఫ్ ప్రదానం చేసిన సర్టిఫికెట్‌ను సోమవారం ఆర్డీవో చెన్నయ్య చేతుల మీదుగా అందుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫరిహా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరుతూ, అభినందించారు. కార్యక్రమంలో కోచ్ ఈ రవిందర్‌గౌడ్ పాల్గొన్నారు.


మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 26 : స్వామినాథన్ కమిషన్ సూచనలు అమలు చేయకుండా, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్రంలోని మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి అన్నారు. మద్దతు ధర చట్టబద్ధత కోసం పోరాడుతున్న రైతులను కాల్చి చంపుతోందని ఆయన ధ్వజమెత్తారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం చేసున్న దమనకాండను నిరసిస్తూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పిస్తామని పార్లమెంట్ సాక్షిగా మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలుచేయాలన్నారు.

దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్న మోదీ రైతులకు మద్దతు ధర ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. స్వామినాథన్‌కు మోదీ ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇచ్చి కమిషన్ సిఫార్సులను అమలుచేయకపోవడం సిగ్గుచేటన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రైతు సమస్యలు పరిష్కరించకుండా రైతు ఉద్యమకారులను ఉగ్రవాదులుగా, దేశ ద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ప్రతీ పంటకు గిట్టుబాటు ధర కల్పించేంత వరకు రైతుల పక్షాన సీపీఐ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, ఉజ్జిని యాదగిరిరావు, జిల్లా సహాయకార్యదర్శిలు పల్లా దేవేందర్‌రెడ్డి, లోడంగి శ్రవణ్‌కుమార్, కార్యవర్గసభ్యులు పబ్బు వీరస్వామి, గురిజ రామచంద్ర, బోడుపల్లి వెంకట్‌రమణ, బోల్గురి నర్సింహా, టీ వెంకటేశ్వర్లు, బంటు వెంకటేశ్వర్లు, నల్పరాజు రామలింగయ్య పాల్గొన్నారు.



నకిరేకల్ నియోజకవర్గం చందుపట్ల రైతువేదికలో ప్రారంభమైన వీడియోకాన్ఫరెన్స్ సేవలు

రైతు కోసం.. సాంకేతిక వేదిక

- వీడియోకాన్ఫరెన్స్‌లకు వీలుగా ఏర్పాట్లు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ప్రారంభం
- రైతులకు సమాచారం కోసం సాంకేతిక వ్యవస్థ
- త్వరలో మరికొన్ని వేదికలకు విస్తరించే అవకాశాలు

సాగుబడిలో రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతువేదికలు మరింత సాంకేతికతను సంతరించుకోనున్నాయి. రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో నేరుగా మాట్లాడేందుకు వీడియోకాన్ఫరెన్స్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా కాలానుగుణంగా సాగురంగంలో పాటించాల్సిన పద్ధతులు, నూతన వంగడాలు, సలహాలు, సూచనలు రైతులు తీసుకునేందుకు వీలుంటుంది. ప్రస్తుతం నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 కేంద్రాల్లో ఈ సిస్టమ్‌ను ఏర్పాటుచేశారు. ఈ విధానం విజయవంతమైతే అన్నిరైతువేదికల్లోనూ వీడియోకాన్ఫరెన్స్ విధానాన్ని ఏర్పాటు చేయనున్నారు.

- నల్లగొండ

రైతు వేదికలు సద్వినియోగం అయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మ డి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సుమారు 314 రైతు వేదికలను రూ.78.50 కోట్ల తో నిర్మించారు. అయితే అప్పట్లో ఎంతో సమున్నత లక్ష్యంతో నిర్మించిన ఈ రైతువేదికలు ఉత్సవ విగ్రహాలుగా మారాయి అన్న ఆరోపణలు వచ్చాయి. వ్యవసాయ అధికారులను రైతులు కలవాలంటే మండల కేంద్రానికో, జిల్లా కేంద్రానికో వెళ్లాల్సిన పని లేకుండా గ్రామీణ ప్రాంతాలలోనే రైతు వేదికలు నిర్మించి అక్కడికే ప్రతి రోజూ వ్యవసాయ అధికారులు వచ్చేలా అప్పటి ప్రభుత్వం ఆలోచన చేసినప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. రైతు వేదికల్లో కనీస సౌకర్యాలు కూడా ఇప్పటికీ లేని పరిస్థితి ఉంది. నీటి వసతి, ఫర్నిచర్, విద్యుత్‌సౌకర్యం కూడా లేకపోవడంతో చాలా చోట్ల వ్యవసాయ అధికారులు రైతు వేదికలకు వెళ్లలేని పరిస్థితి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రైతులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సమావేశమై సాగు సమస్యలపై చర్చించేందుకు రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాన్ని కల్పిస్తోంది. సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మిర్యాలగూడ, మునుగోడు, నకిరేకల్(చందుపట్ల), నల్లగొండ(తిప్పర్తి), నాగార్జునసాగర్(త్రిపురారం), తుంగతుర్తి(వర్ధమానుకోట), హుజూర్‌నగర్(గుడుగుండ్లపాలెం), కోదాడ, సూర్యాపేట(పెన్‌పహాడ్), ఆలేరు(రాజాపేట), భువనగిరి(వలిగొండ) నియోజకవర్గాలోని కేంద్రాలతో పాటు ఆయా నియోజకవర్గాల పరిధిలో వీడియోకాన్ఫరెన్స్ కేంద్రాలుగా మలిచిన రైతువేదికలను అధికారులు ప్రారంభించారు.

వీడియో కాన్ఫరెన్స్‌తో రైతులకు అవగాహన

వీడియోకాన్ఫరెన్స్‌తో రైతులకు అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం నియోజకవర్గానికి ఒక వీడియోకాన్ఫరెన్స్ సిస్టమ్‌ను ఏర్పాటుచేసిన ప్రభుత్వం త్వరలో చాలా రైతు వేదికల్లో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురానుంది. ఈ వేదికల ద్వారా వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూసార పరీక్షలతో పాటు ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు, రైతుబీమా, ఆయిల్‌పామ్ సాగుతో పాటు ఇతర పంటలన్నింటిపై అవగాహన కల్పించడం కోసం ఈ వేదికలను రూ.22లక్షల నుంచి రూ.25లక్షల వరకు వెచ్చించి నిర్మించారు. దీంతో పాటు రైతువేదికల నిర్వహణకు ప్రతినెలా రూ.9వేలు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఉమ్మడి జిల్లాలో చాలాచోట్ల రైతు వేదికలకు నిర్వహణ కోసం కొన్నాళ్లుగా నిర్వవహణ నిధులు చెల్లించకపోవడంతో ఏఈవోలే ఆ భారం భరించాల్సి వస్తోంది. అయితే ఇందుకోసం చేసిన ఖర్చును బిల్లులు పెట్టుకుంటే ప్రభుత్వం నుంచి వస్తాయో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. రైతు వేదికలు రైతులకు ఉపయోగకరంగా ఉండకపోవడంతో పాటు ఆయా వేదికల్లో కొన్ని చోట్ల అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకున్నట్లు చర్చ సాగుతోంది. నీటి సౌకర్యం లేదని వ్యవసాయ అధికారులు ఎంత మొత్తుకున్నా కూడా కొన్నిచోట్ల మిషన్ భగీరథ స్కీమ్ కింద పైపులైన్లు వేయకపోవడం నీటి వసతి కల్పించకపోవడం వంటి పరిస్థితులు ఉన్నాయి. బాత్‌రూంలు లేకపోవడంతో మహిళా ఉద్యోగినులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. అయితే ప్రతిరోజూ రైతు వేదికలో కూర్చోవాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో విధి లేని పరిస్థితుల్లో ఆ ప్రాంత వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయి అధికారి రైతువేదిక వద్దకు వెళ్తున్నారు తప్ప కూర్చోని పని చేసుకోవడానికి మాత్రం అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి నిధులు నెల నెలా కేటాయించి వ్యవసాయ శాఖతో పాటు ఇతర శాఖలకు క్షేత్ర స్థాయి సిబ్బందికి ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేస్తే రైతు వేదికల ద్వారా ప్రజలకు సేవలు చేరువయ్యే అవకాశాలు ఉంటాయి.

రైతులకు ఎంతగానో ప్రయోజనం

ప్రభుత్వం తీసుకవచ్చిన వీడియోకాన్ఫరెన్స్ సిస్టమ్ వల్ల రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది. వ్యవసాయ అధికారులతో పాటు శాస్త్రవేత్తలు రైతులకు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సలహాలు సూచనలు ఇవ్వడం జరుగుతుంది. ప్రస్తుతం నియోజకవర్గానికో రైతువేదికలో ఈ విధానాన్ని అమలులలోకి తీసుకరావడం జరిగింది. రైతులు వీడియోకాన్ఫరెన్స్ ఉన్న రోజు సద్వినియోగం చేసుకోవాలి.



- పీ శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ

కోట్లు వెచ్చించినా నెరవేరని ప్రయోజనం

ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వం ఉపాధి నిధులతో పాటు వ్యవసాయ శాఖ నిధుల ద్వారా రూ.78.50 కోట్లు వెచ్చించి 314 వేదికల ను నిర్మించారు. నల్లగొండ జిల్లాలో 140, సూర్యాపేట జిల్లాలో 82, యాదాద్రి భువనగిరి జిల్లాలో 92 రైతు వేదికలను నిర్మించారు. మూడు జిల్లాల్లో చాలా మండలాల్లో రైతువేదికలు ఉపయోగంగా లేకుండా ఉంటున్నాయని, ఉన్నతాధికారులు ఒత్తిడి చేసినప్పుడు మాత్రమే అప్పుడప్పుడు తెరిచి కొంత సేపు మాత్రమే క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులు కూర్చుంటున్నారని తెలుస్తోంది. రైతు వేదికల్లో వ్యవసాయ అధికారులు కూర్చున్నట్లయితే వారికి రైతులు సమస్యలు చెప్పుకునే అవకాశం ఉంటుంది. మండల కేంద్రాల్లో, ముఖ్యమైన పట్టణాల్లో ఉన్న రైతు వేదికల్లో మాత్రం తనిఖీలు ఉంటాయన్న ఆలోచనతో కొంత వరకు వ్యవసాయ శాఖ అధికారులు కూర్చున్నప్పటికీ మారుమూల గ్రామాల్లో, అధికారులు తనిఖీలు ఉండవని భావిస్తే మాత్రం క్షేత్రస్థాయి అధికారులు మొక్కుబడిగా వచ్చిపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా వివిధ రకాల పంటలకు వచ్చే తెగుళ్ల గురించి, నూతన రకాల పంటలు వేయడం గురించి, ఎరువులు, విత్తనాల వాడకం మొదలు ఇతర అంశాలపై వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకుందామంటే అధికారులు అందుబాటులో లేని పరిస్థితి. గతంలో వానాకాలం పంటల సాగు ప్రారంభానికి ముందు గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పల్లెబాట వంటి కార్యక్రమం నిర్వహించి రైతులను వానాకాలం సీజన్‌పై అవగాహన కల్పించేది. కానీ ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా కూడా లేకుండాపోయింది. ఆ కార్యక్రమం పూర్తిగా రద్దయ్యింది. అలాంటప్పుడు రైతు వేదికల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన రెండు సీజన్‌లోనూ రైతులకు ఈ వేదికలు పూర్తిస్థాయిలో ఉపయోగపడితే ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు ప్రయోజనకరంగా మారుతాయని పలువురు వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. తాజాగా ప్రభుత్వం వీడియోకాన్ఫరెన్స్‌ను అమలులోకి తీసుకొచ్చిన నేపథ్యంలో వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు రైతులతో నేరుగా మాట్లాడి సలహాలు సూచనలు ఇవ్వనున్నారు. పంటల తెగుళ్ల, సాగు విధానాలు, ఇతర అంశాలపై వివరించనున్నారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

- ఇకపై ప్రతి నెలా జాబ్‌మేళా
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఎంజీయూలో మెగా జాబ్‌మేళాను ప్రారంభించిన మంత్రి



మెగాజాబ్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 26 : నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ)లో టాస్క్, టీఎఫ్ఎంసీ, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుద్యోగం పెరిగిపోతున్న తరుణంలో జిల్లా కేంద్రంలో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పెద్దఎత్తున 13,000 మందికి ఉద్యోగాలు కల్పించేలా 127 కంపెనీలను తీసుకువచ్చి ఉపాధి కల్పించే జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్‌మేళా ద్వారా రూ.లక్ష కనీసం వేతనం ఇచ్చేందుకు కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. ముఖ్యంగా టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, అరవింద వంటి పెద్దపెద్ద కంపెనీలు సైతం జాబ్‌మేళాలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతీక్ ఫౌండేషన్, సుభద్ర ఫౌండేషన్‌ల ద్వారా గతంలో జిల్లాలో 18,410 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి, రూ.3 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వార్షిక వేతనాలు ఇప్పించామన్నారు. అంతేకాక జేఎన్‌టీయూలో జాబ్‌మేళా నిర్వహించి 10వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందన్నా రు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నా రు. విద్యార్థుల్లో ఉన్న శక్తి సామర్థ్యాలను బయటకు తీసి బాగా కష్టపడి చదివి ముందుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఇకపై ప్రతినెలా జాబ్‌మేళాలు ఉంటాయని, వచ్చే నెల ఎన్జీ కళాశాలలో ఏర్పాటుచేస్తామన్నారు. అంతకు ముందు ఎంజీయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్, స్పోర్ట్స్‌కాంప్లెక్స్, యాంపీ థియేటర్, ఇంజనీరింగ్, టెక్నాలజీ నూతన భవనాలను మంత్రి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. రాష్ట్రంలోనే ఎంజీయూను మంచి విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. విశ్వవిద్యాలయంలో చేపట్టే ఇతర భవనాల కోసం రూ.100 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే వీటి పనులు చేపడతామన్నారు. ఎస్పీ చందనాదీప్తి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు మెగా జాబ్‌మేళా ఒక మంచి అవకాశం అని, స్థానిక ప్రతిభకు తగ్గట్టుగా ఉద్యోగాలు దొరికే అవకాశం ఇక్కడ దొరికిందన్నారు. అందరూ గర్వపడేలా నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని యువత నైపుణ్యాలను వెలికి తీయడంలో భాగంగా మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిఆరు. టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా మాట్లాడుతూ 127 కంపెనీలతో అతిపెద్ద జాబ్‌మేళాను ఎంజీయూలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా ఇక్కడ ఉన్నట్లు ఇంజనీరింగ్ నైపుణ్యాలు ఎక్కడా లేవన్నారు. 127 కంపెనీలు పాల్గొన్న జాబ్‌మేళాకు సుమారు 13వేల మంది ఉద్యోగార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 9,456మంది హాజరయ్యారు. 6,680మందిని పలు కంపెనీలు ఉద్యోగాలకు ఎంపికచేశాయి. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, విశ్వవిద్యాలయం ఉపకులపతి సీహెచ్ గోపాల్‌రెడ్డి, టీఎఫ్ఎంసీ, సీఈవో సత్యనారాయణ, ప్రతీక్ ఫౌండేషన్ సీఈవో గోనారెడ్డి, నల్గొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రమేష్‌గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 26 : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల ఉంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులను సమన్వయపరిచి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 50అర్జీలు వచ్చాయి. కట్టంగూరు నుంచి వచ్చిన దివ్యాంగుడు ఏర్పుల వెంకన్నకు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, హౌసింగ్ పీడీ రాజకుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, డీఈవో బిక్షపతి, స్త్రీ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి బీ సక్కుబాయిలు కలిసి ట్రైసైకిల్‌ను అందజేశారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పని చేయాలి



నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 26 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరం న్యాయం అందేలా పనిచేయాలని ఎస్పీ చందనాదీప్తి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 40 మంది నుంచి అర్జీలను తీసుకుని వారితో మాట్లాడారు. సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. ఫిర్యాదుల్లో ఎక్కువగా భూసమస్యలు, భార్యాభర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్ సమస్యలపై ఉన్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలకు పాల్పడితే వారితో కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రతీ అర్జిని ఆన్‌లైన్‌లో పొందుపరిచి నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

రూ.125.78కోట్ల మునిసిపల్ బడ్జెట్

- ఆమోదించిన కౌన్సిల్ వాస్తవిక బడ్జెట్‌ను రూపొందించాం
- గతంలో అక్రమాలపై విచారణ చేపట్టాలి: కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి, ఫిబ్రవరి 26 : గత ఏడాది బడ్జెట్ అంకెల గారడీ చేసి రాబడి చూపించారు కానీ, ఈ సారి వాస్తవాన్ని అంచనా వేసి బడ్జెట్‌ను రూపొందించామని నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో బడ్జెట్‌పై నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మునిసిపల్ కౌన్సిల్ అనుమతి లేకుండా కలెక్టర్, ఎస్పీ బంగాళాలకు రంగులు, బొమ్మలు వేసి రూ.లక్షల్లో ఖర్చు చేశారని, వాటి ఖర్చు వాస్తవిక వివరాలు వచ్చే నెలలో స్పష్టం కానున్నాయన్నారు. గత నాలుగేళ్లలో ప్రతీ వార్డు అభివృద్ధికి కేవలం రూ.37లక్షలు మాత్రమే కేటాయించారని, ప్రధాన రహదారి చూపెట్టి పట్టణమంతా అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పారని ధ్వజమెత్తారు. గతంలో అభివృద్ధి నిధులు దారి మళ్లింపుపై విచారణ చేపట్టి కౌన్సిల్ ముందు ఉంచుతామన్నారు. 2019 మునిసిపల్ యాక్ట్‌ను మార్పిడి చేసి అసంపూర్తి చట్టం తెచ్చిన గత ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రతినిధుల హక్కులను కాలరాసిందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో విలీన గ్రామాలల్లో పూర్తిస్థాయిలో రోడ్లు, కనీస సౌకర్యాలు కల్పించి పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆస్తిపన్ను, బిల్లుల వసూలుకు కౌన్సిల్ సభ్యులంతా సహకరించాలని కోరారు.

రూ.125.78 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నల్లగొండ మునిసిపల్ బడ్జెట్ రూ.125.78కోట్లకు పాలకవర్గం ఆమోదం లభించింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి అంచనా ప్రారంభం నిల్వ రూ.7.04 కోట్లుగా చూపించగా ఈఆర్థిక సంవత్సరంలో సాధారణ ఆదాయం రూ.61.50వేలు కాగా అంచనా సాధారణ వ్యయం రూ.60కోట్ల32లక్షల52వేలు అంచనా వేశారు. క్యాపిటల్ ఆదాయంతో కలుపుకుని రూ.125.78.400వేలు కాగా వ్యయం రూ.125.78 కోట్లు చూపించారు. డిపాజిట్లు, అప్పులు రూ.4.20 కోట్లుగా అంచనా వేసి బడ్జెట్ రూపొందించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్‌ఆహ్మద్, ఈఈ రాములు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



గతంలో జరిగిన నిధుల దారి మళ్లింపు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతీ బడ్జెట్‌లో పదిశాతం హరితాహారం పేరిట నిధులు కేటాయించారు. హరితాహారం కింద ఎన్ని మొక్కలు నాటారో, అవి ఎన్ని బతికాయో పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలి. హరితాహారం పేరిట పూర్తిస్థాయిలో నిధులు దుర్వినియోగం అయ్యాయి. వైకుంఠధామాల నిర్మాణంలో కూడా అవినీతి జరిగింది.

- బండారు ప్రసాద్, బీజేపీ ఫ్లోర్‌లీడర్

దారి మళ్లిన నిధులపై విచారణ జరిపించాలి

గత సంవత్సరం అభివృద్ధి పేరిట నిధులను మళ్లింపుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలి. గతంలో దాదాపు రూ.50కోట్లు ఇతర పనులకు దారి మళ్లించినట్లు తెలుస్తోంది. గతంలో రూపొందించిన బడ్జెట్ అంకెల గారడీ తలపించేది ఉండగా ఈసారి వాస్తవిక బడ్జెట్‌ను రూపొందించడం హర్షించదగ్గ విషయం.

- ఖయ్యూం బేగ్, కౌన్సిలర్

తమ్ముడి చేతిలో అన్న హతం

● కత్తిపీటతో దాడి.. ఆ పై బండరాయితో మోది హత్య

● నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో దారుణం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, రాంబాబు(ఫైల్)

శాలిగౌరారం, ఫిబ్రవరి 26: తమ్ముడి చేతిలో అన్న దారుణ హత్యకు గురయ్యాడు. కత్తిపీటతో దాడి చేసి ఆపై బండరాయితో మోది దారుణంగా హత్య చేశాడు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. శాలిగౌరారం ఎస్ఐ ఎం.ఐలయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చర్లపెల్లి పద్మ, వెంకన్న దంపతులకు గ్రామంలో రెండు ఎకరాల 30గుంటల వ్యవసాయ భూమి ఉంది. వెంకన్న అనారోగ్యంతో 10 సంవత్సరాల క్రితం మృతిచెందాడు. కుమారులు రాంబాబు(30), నవీన్‌లతో కలిసి తల్లి పద్మ కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. అన్నదమ్ముళ్లకు వివాహాలు కాలేదు. రూ.20లక్షల అప్పు ఉండడంతో 30గుంటల భూమి విక్రయించగా రూ.26లక్షలు వచ్చాయి. రూ.20లక్షల అప్పు తీర్చగా మిగిలిన 6లక్షల రూపాయల్లో తల్లి పద్మ రూ.2లక్షలు, రాంబాబుకు రూ.2లక్షలు, నవీన్‌కు రూ.2లక్షల ఇచ్చింది. పెద్ద కుమారుడు రాంబాబు ఇటీవలే తమ ఇంటి వద్ద చిన్నపాటి మొబైల్ షాప్(రీచార్జ్‌లు చేసేందుకు, చిన్న చిన్న వస్తువులు) పెట్టుకున్నాడు. నవీన్ ఇంట్లోనే ముభావంగా ఉంటూ ఎవరితోనూ సరిగా వ్యవహరించేవాడు కాదు. నవీన్ ఇటీవల ఆటోను కొనుక్కుని నడిపిస్తున్నట్లు తెలిసింది. కొత్తగా ఇల్లు నిర్మించుకుందామని రాంబాబు 15 రోజులుగా తల్లి పద్మ, తమ్ముడు నవీన్‌కు చెబుతున్నాడు. దీంతో అన్నదమ్ముళ్ల మధ్య ప్రారంభమయ్యాయి. ఇల్లు కట్టుకోవడానికి తాను ఒక్కపైసా కూడా ఇవ్వనని నవీన్ తల్లి, సోదరుడితో రోజూ గొడవ పెట్టుకుంటున్నాడు. ఇదే కాకుండా డబ్బుల విషయంలో అన్నదమ్ముళ్ల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని ఫంక్షన్‌హాల్‌లో జరిగే వివాహానికి రాంబాబు వెళ్తుండగా, తమ్ముడు నవీన్ కత్తిపీటతో అకస్మాత్తుగా దాడి చేశాడు. రాంబాబు కింద పడిపోగానే దగ్గరలో ఉన్న బండరాయిని తలపై వేయటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ సమయంలో తల్లి ఇంటి ముందు ఉన్న దుకాణానికి వెళ్లి, తిరిగి వచ్చి చూసే సరికే రాంబాబు రక్తపు మడుగులో విగతజీవిగా పడిఉన్నాడు. సంఘటనా స్థలానికి కొద్ది దూరంలో కూర్చున్న నవీన్ చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, నకిరేకల్ సీఐ రాజశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం రాంబాబు మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి నిందితుడైన నవీన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఐలయ్య తెలిపారు.

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

● సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో ఘటన


శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 26: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో శివలింగాన్ని సూర్యకిరణాలు తాకాయి. సోమవారం ఉదయం 6.30గంటల నుంచి ఏడు గంటల వరకు సూర్యకిరణాలు శివలింగాన్ని తాకడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రికి ముందు మాఘ మాసంలో రెండు వారాల పాటు శివలింగాన్ని సూర్యకిరణాలు తాకుతాయని ఆలయ అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ తెలిపారు. ఈ సందర్భంలో స్వామివారిని దర్శించుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్య లో భక్తులు వస్తుంటారని, ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలతో పాటు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేయాలి

మఠంపల్లి, ఫిబ్రవరి 26: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని పెదవీడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 540లో ఈ నెల 29వ తేదీన నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేయాలని పెదవీడు గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు రెడపంగు వెంకటేశ్వర్లు, సుధాకర్ కోరారు. ఉన్నతాధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పెదవీడు రెవెన్యూలోని సర్వేనంబర్ 540లో ఎన్‌సీఎస్ వైట్ సిమెంట్స్ పరిశ్రమ నిర్మాణానికి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, తప్పుడు ధ్రువీకరణలతో పాటు నిరుపేదలకు చెందిన స్థలంలో పరిశ్రమను ఏర్పాటుకు అనుమతులు ఇవ్వదని, వెంటనే ఉన్నతాధికారులు ఈ ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేయాలని డిమాండ్‌చేశారు. పేదల గిరిజన, దళితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. మండలంలోని పెదవీడు రెవెన్యూలో ఏర్పాటు చేయనున్న ఎన్‌సీఎస్ వైట్ సిమెంట్స్ పరిశ్రమ సుల్తాన్‌పురం తండా గ్రామపంచాయతీ పరిధిలో తీసుకున్న తర్వాతే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని తండావాసులు ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న పద్మ

నాగారం, ఫిబ్రవరి 26: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన రైతు మట్టగజం అవిలయ్య(45) తనకున్న 10ఎకరాల భూమిలో వరి సాగు చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం పొలానికి నీరు పెట్టేందుకు మెటారు వద్దకు వెళ్తున్న క్రమంలో పొలం గట్ల మధ్య విద్యుత్ సర్వీసు వైరు అక్కడక్కడ జాయింట్ ఉండి గట్ల కిందపడి ఉంది. వైరును గమనించక వైర్లు కాలుకు తగిలి అవిలయ్య విద్యుదాఘాతంతో గట్ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి అక్కడికి వెళ్లి చూడగా అవిలయ్య విగత జీవిగా పడి ఉన్నాడు. అక్కడి రైతులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి విద్యుత్ సర్వీస్ వైరును తొలగించి అవిలయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. భర్త మృతదేహాన్ని చూసి భార్య పద్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. అవిలయ్యకు భార్య, ఇద్దరు కూమారులు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని నాగారం ఎస్ఐ పి. వెంకటరెడ్డి పరిశీలించారు.



జెరియాట్రిక్



'వయసు పైబడుతోంది కదా!
మునుపటి ఓపిక ఉండదులే!
ఇదంతా సహజం' అని
సరిపెట్టుకుంటున్నారా?
కానీ మలి వయసుకు
చేరుకుంటున్నా సత్తువ
సడలకుండా ఉండాలంటే
కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

ఎనభైలో నలభైలా





వయసు పైబడేకొద్దీ పుట్టిన రోజు దగ్గర పడుతుంటే గుండెల్లో బేజారు మొదలవుతూ ఉంటుంది. యాభైకి చేరుకుంటే అర్థాయుష్షు అయిపోయిందే అని కొంత నిరాశకు లోనయ్యేవాళ్లూ ఉంటారు. నిజానికి ఒంట్లో తగ్గిపోయే హుషారు, చలాకీతనం, పెరిగిపోయే నిస్సత్తువ, నీరసాలు పైబడే వయసును అనుక్షణం గుర్తు చేస్తూనే ఉంటాయి. 'అప్పట్లో నేను అలవోకగా పనులన్నీ చేసుకోగలిగేదాన్ని, సునాయాసంగా పనులన్నీ చక్కబెట్టేదాన్ని, చకచకా పరుగులెత్తేదాన్ని' అని పాత రోజుల గురించి గర్వంగా చెప్పుకోవడమే కాదు, అదే ఆరోగ్యాన్నీ, శరీర దారుఢ్యాన్నీ మున్ముందు కూడా కొనసాగించే వీలుంది. అయితే అందు కోసం ప్రణాళికాబద్ధంగా నడుచుకోవాలి. చేసే పనులు, తీసుకునే ఆహారం పట్ల శ్రద్ధ కనబరచాలి. మరీ ముఖ్యంగా మనసు వయసు పైబడనీయకూడదు.

క్రమం తప్పని వ్యాయామం

పైబడే వయసులో కండరాల నొప్పులు వేధిస్తున్నాయంటే, కండరాల పటుత్వం తగ్గిందని అర్థం. కీళ్ల నొప్పులు మొదలైనప్పుడు, రోజూ నడవడం మొదలు పెట్టండి అని వైద్యులు సూచిస్తూ ఉంటారు. కీళ్లు అరగడం మొదలైతే నడవడం వల్ల అవి ఇంకా వేగంగా అరిగిపోతాయి కదా? అని అయోమయానికి గురి కాకూడదు. నడక వల్ల కాళ్లలోని కండరాలు బలం పుంజుకుని ఊతాన్నిస్తాయి. దాంతో కీళ్ల మీద ఒత్తిడి తగ్గి అవి అరిగే వేగం నెమ్మదిస్తుంది. పైగా రోజు మొత్తంలో పది వేల అడుగులు నడిచే వ్యక్తుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని శాస్త్రీయంగా రుజువైంది. కాబట్టి కండరాల పటుత్వం కోసం నడక, ఈత, సైక్లింగ్... ఇలా నచ్చిన వ్యాయామానికి దైనందిన జీవితంలో చోటు కల్పించాలి. ఏరోబిక్స్‌తో పాటు రెసిస్టెన్స్ వ్యాయామాలు చేయవచ్చు. ఎముకల దృఢత్వం కోసం వెయిట్ ట్రైనింగ్ కూడా చేస్తూ ఉండాలి. బరువులు ఎత్తడం వల్ల కండరాలు బలం పుంజుకోవడంతో పాటు, శారీరక దారుఢ్యం కూడా పెరుగుతుంది.

సమతులాహారం

ఆదివారం వస్తే నాన్ వెజ్, మిగతా రోజులంతా వెజిటేరియన్ వంటకాలను వండుకోవడం మన ఆనవాయితీ. కానీ అన్ని రకాల పోషకాలూ సమపాళ్లలో అందాలంటే ఏ పదార్థాల్లో ఏ పోషకాలుంటాయో అవగాహన ఏర్పరుచుకుని రోజు మొత్తంలో సరిపడా పోషకాలన్నీ అందుతున్నాయో లేదో గమనించుకుంటూ ఉండాలి. నాన్ వెజ్ వండుకుని తింటే ప్రొటీన్ ఒక్కటే అందుతుంది. మరి మిగతా విటమిన్లు, ఖనిజ లవణాలు, సూక్ష్మపోషకాల మాటేమిటి? అలాగే కేవలం ఒక్క కూరగాయతో సరిపెట్టుకుంటే ప్రొటీన్ దక్కేదెలా? కాబట్టి వారాంతాల్లో నాన్‌వెజ్‌కు పరిమితమయ్యేవాళ్లు, కూరగాయలతో కలిపి నాన్ వెజ్ వండుకోవడం, లేదా అదనంగా వెజిటేరియన్ వంటకం చేసుకోవడం అవసరం. అలాగే కూరగాయలను పప్పుదినుసులతో కలిపి వండుకోవడం, గుడ్డుతో కలిపి వండుకోవడం లాంటివి కూడా చేయవచ్చు.



ప్రొటీన్ సరిపడా

సంపూర్ణ ఆరోగ్యానికి, రక్తహీనత తలెత్తకుండా ఉండడానికీ సరిపడా ప్రొటీన్ అవసరం. మాంసాహారం తినలేని వాళ్లు కంది, పెసరపప్పులను తినవచ్చు. చిక్కుళ్లు, బఠాణీ, మునగ, పుట్టగొడుగుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. ప్రతి రోజూ ఆహారంలో సరిపడా ఉండేలా మీల్ ప్లాన్ చేసుకోవాలి. అల్పాహారం తీసుకోవడం తప్పనిసరి. ఉదయం తినే అల్పాహారంలో ప్రొటీన్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఉడకబెట్టిన సెనగలు, బొబ్బర్లు, మొలకలు లాంటి వాటిని సాయంత్రం స్నాక్‌గా తీసుకోవచ్చు.

ద్రవాలూ ముఖ్యమే!

ఒళ్లు నొప్పులకు శరీరంలో నీటి శాతం తగ్గడం ఒక కారణం. కండర నొప్పులు తరచూ వేధిస్తున్నా, కండరాలు పట్టేస్తున్నా శరీరంలో నీరు తగ్గిందని అర్థం చేసుకుని సరిపడా నీళ్లు తాగుతూ ఉండాలి. గుండె, కిడ్నీ సంబంధ వ్యాధులు లేనివాళ్లు రోజుకు కనీసం 3 లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగాలి. ఇది వేసవి కాలం కాబట్టి పండ్ల రసాలూ, కొబ్బరినీళ్లు, పలుచని మజ్జిగ కూడా తీసుకోవచ్చు. సబ్జా నీళ్లు ఆరోగ్యకరం. శరీరాన్ని చల్లబరిచే నిమ్మరసం, క్యారట్, బీట్‌రూట్ జ్యూస్ తాగుతూ ఉండాలి. శీతల పానీయాలు, చక్కెర కలిసి ఉండే పౌడర్ ఆధారిత పానీయాలు, సిరప్స్ దాహార్తిని తీర్చకపోగా, శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశాలను పెంచుతాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండాలి.



సరిపడా విశ్రాంతి

కంటి నిండా నిద్ర, సరిపడా విశ్రాంతి కూడా అవసరమే! చలాకీగా, చురుగ్గా కదలడానికి సరిపడా ఓపిక శరీరానికి దక్కాలంటే, మధ్యాహ్నం వేళ ఒక అరగంట పాటు కునుకు తీస్తూ ఉండాలి. దాంతో కండరాలు శక్తిని పుంజుకుంటాయి. 7 నుంచి 8 గంటలకు తగ్గకుండా నిద్రపోవడం వల్ల శరీర బడలిక వదిలి, కొత్త శక్తిని పుంజుకుంటుంది. కాబట్టి నిద్రకు భంగం కలిగించే అంశాలకు దూరంగా ఉంటూ, కంటి నిండా నిద్రపోవాలి.

ఎముకల పటుత్వం ఇలా సాధ్యం

పైబడే వయసులో ఎముకల పటుత్వం క్షీణించడం సహజం. అలా జరగకుండా నియంత్రించాలంటే పోషకాహారంతో పాటు కొన్ని అదనపు సప్లిమెంట్లు కూడా తీసుకుంటూ ఉండాలి. అవేంటంటే...

- **క్యాల్షియం:** అరవై ఏళ్లు పైబడిన స్త్రీపురుషులు క్యాల్షియం సమృద్ధిగా దొరికే పాలు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, డ్రై సీడ్స్, బాదం, పిస్తా తప్పనిసరిగా తీసుకోవాలి. ఆహారం ద్వారా సరిపడా క్యాల్షియం దక్కేవీలు లేని సందర్భాల్లో వైద్యులు సూచించిన సప్లిమెంట్లు వాడుకోవచ్చు.
- **విటమిన్ డి:** ఎముకల దృఢత్వానికి డి విటమిన్ అవసరం. ఆహారం ద్వారా దొరికే అవకాశం లేని డి విటమిన్‌ను పొందడం కోసం కనీసం ఒకటి నుంచి రెండు గంటల పాటు ఎండలో గడపడం అవసరం. సాధ్యపడని సందర్భాల్లో వైద్యులు సూచించే సప్లిమెంట్లు వాడుకోవాలి.
- **వ్యాయామాలు:** నడక, పరుగు, బరువులెత్తడం, సైక్లింగ్ శరీరం మీద బరువు పడేలా చేసే వ్యాయామాలన్నీ ఎముకల పటుత్వాన్ని పెంచుతాయి. నడి వయసులో తుంటి ఎముకలు తేలికగా విరిగిపోతూ ఉండడానికి కారణం ఎముకలు గుల్లబారడమే! ఈ సమస్య తలెత్తకుండా ఉండాలంటే మరీ ముఖ్యంగా మహిళలు బరువులతో కూడిన వ్యాయామాలు చేయాలి.
- **ఇవి వద్దు:** ఆల్కహాల్, చక్కెర, కాఫీలు ఎముకల సాంద్రతను తగ్గిస్తాయి. వీటికి వీలైనంత దూరంగా ఉండాలి. ముఖ్యంగా ధూమపానం ఎముకలకు హానికరం. కాబట్టి ఈ అలవాటు ఉన్నవాళ్లు నడవయసుకు చేరుకున్న తర్వాత పూర్తిగా మానేయాలి.
- **ఆరోగ్య పరీక్షలు:** 55 ఏళ్లు దాటిన మహిళలు, 65 ఏళ్లు దాటిన పురుషులు ప్రతి మూడేళ్లకోసారి ఎముకల సాంద్రతను పరీక్షించుకుంటూ ఉండాలి. ఈ పరీక్షతో ఎముకల సాంద్రతను అంచనా వేస్తూ, అప్రమత్తం అవుతూ ఉండాలి. ఎముకలు గుల్లబారే సమస్యను ఈ పరీక్షతో గుర్తించినప్పుడు వైద్యులు సూచించిన మందులు తీసుకోవాలి. వ్యాయామాలు మొదలుపెట్టాలి.

జీవనశైలి వ్యాధులు రాకుండా....

45 ఏళ్లు దాటిన వాళ్లలో అధిక రక్తపోటు, మధుమేహాలు సర్వసాధారణమైపోతున్న కాలమిది. ఇలాంటి జీవనశైలి వ్యాధులు దాడి చేయకుండా ఉండాలంటే...

- వయసు పైబడేకొద్దీ కణాల్లో జరిగే ఆక్సీడేషన్ డ్యామేజీ వల్ల కేన్సర్ వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. కాబట్టి యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా దొరికే తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఆహారంలో పండ్లు, కూరగాయలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. నిల్వ ఉన్న పదర్థాలు, ప్యాకేజ్డ్ ఫుడ్, చక్కెర, ఉప్పు, నూనెలు ఎక్కువగా ఉండే పదార్థాలను తినడం మానేయాలి.
- కొన్ని దీర్ఘకాలిక వ్యాధులకు మానసిక ఒత్తిడే ప్రధాన కారణం. ప్రాణాయామం, ధ్యానం ద్వారా ఒత్తిడిని వదలించుకోవాలి. ఇంటి పట్టున ఉండేవాళ్లు నచ్చిన ఏదో ఒక వ్యాపకాన్ని ఎంచుకోవాలి. మెదడును చురుగ్గా ఉంచే ఇండోర్ గేమ్స్, శరీరాన్ని చురుగ్గా ఉంచే ఔట్‌డోర్ గేమ్స్ ఆడుతూ ఉండాలి.
- **వైద్య పరీక్షలు:** అధిక రక్తపోటు, మధుమేహం సమస్యలున్నవాళ్లు క్రమం తప్పక పరీక్షలు చేయించుకుంటూ వాటిని అదుపులో ఉంచుకోవాలి. సంబంధిత వైద్య నిపుణులను కూడా సంప్రతిస్తూ ఉండాలి. అన్ని విధాలా ఆరోగ్యంగా ఉన్నవాళ్లు ఏడాదికోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. గుండెజబ్బు, మధుమేహం ఉన్నవాళ్లు ఆరు నెలలకోసారి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఈ పరీక్షలతో ప్రారంభంలోనే సమస్యను గుర్తించే వీలుంటుంది.

డాక్టర్ వేద ప్రకాష్. జి
సీనియర్ కన్సల్టెంట్,
ఆర్థోపెడిక్ సర్జన్ అండ్
జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్,
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్.



సైకాలజీ

ఇదీ ఓ కారణమే!

కొందరి మానసిక సమస్యలకు వారి వ్యక్తిత్వాలూ కారణమవుతూ ఉంటాయి. కాబట్టి సమస్యనుబట్టి ఎవరికి వారు లోతుగా విశ్లేషించుకుని, వ్యక్తిత్వంలో స్వల్ప మార్పులు చేసుకోగలిగితే ఇబ్బందులు సర్దుకుంటాయి. ఉదాహరణకు...

- సోషల్ యాంగ్జయిటీ, ప్యానిక్ అటాక్స్, డిప్రెషన్: మానసికంగా కుంగిపోయినప్పుడు ఇతరుల సహాయాన్ని అర్థించకుండా ఒంటరిగా ఉండడానికే ఇష్టపడతారు. ఇలాంటివాళ్లు సరైన సమయంలో వైద్యులతో మాట్లాడితే సమస్య సర్దుకుంటుంది.



- డిప్రెషన్, యాంగ్జయిటీ: పర్‌ఫెక్షనిస్టులు వాళ్ల గురించి వాళ్లు ఎక్కువ అంచనాలు కలిగి ఉంటారు. తమని ఓడించడం ఎవరి తరమూ కాదనే నమ్మకంతో ఉంటారు. దాంతో ఎప్పుడైనా ఓటమిపాలైతే విపరీతంగా కుంగిపోయి, డిప్రెషన్‌లో కూరుకుపోతారు. ఇలాంటప్పుడు ఒత్తిడికి లోనయినట్టు మీ శరీరం చెబుతున్న విషయాన్ని ఆలకించాలి. అంచనాలు తగ్గించుకుని ప్రశాంతంగా ఆలోచించడం మొదలుపెడితే మానసికి ఇబ్బందులు సమసిపోతాయి.
- బైపోలార్ డిజార్డర్ డిప్రెషన్: సృజనాత్మక వ్యక్తులు గతాన్ని తరచుగా తలుచుకోవడం, జరిగిపోయినదానికి చింతిస్తూ ఉండే వ్యక్తిత్వం కలిగి ఉంటారు. ఇలాంటివాళ్లు మానసిక సమస్యలకు గురి కాకుండా ఉండాలంటే, మానసిక స్థిరత్వాన్ని పెంపొందించుకుని, తమకున్న సృజనాత్మకతకు మెరుగులు దిద్దాలి.

ఆయుర్వేదం

మెదడు చురుకుగా...


జ్ఞాపకశక్తి, తెలివితేటలు తగ్గడానికి కారణం పోషకాహార లోపం, మెదడులో తయారయ్యే రసాయనాలలో అసమతౌల్యమే ప్రధాన కారణాలని ఆయుర్వేదం చెబుతోంది. ఈ మార్పులు సహజసిద్ధంగా శరీరంలో జనించవచ్చు, లేదా మందుల ప్రభావం వల్ల కూడా తలెత్తవచ్చు. కఫ దోషం వల్లే జ్ఞాపకశక్తి సన్నగిల్లుతుందని ఆయుర్వేదం నమ్ముతోంది. ఈ దోషం ఫలితంగా మెదడు పనితీరు మందగించి, ఆలోచనల్లో అస్పష్టత చోటుచేసుకుంటుంది. కాబట్టి జ్ఞాపకశక్తి పెరగాలంటే వాత, కఫ దోషాలను సమతులం చేయాలి. వాత, కఫ దోషాల సమ్మేళనం జ్ఞాపకశక్తిని పెంచుతుంది. పిత్త దోషం మెదడు చురుకుదనాన్ని మెరుగుపరుస్తుంది. అయితే ఈ దోషాలన్నీ సమతులం కావాలంటే ఆహారవ్యవహారాల్లో కొన్ని మార్పులు చేసుకోవాలి.



- **ఆహారం:** దోష తత్వం ఆధారంగా ఆహారశైలిని అనుసరించాలని ఆయుర్వేదం సూచిస్తున్నా, మరీ ముఖ్యంగా జ్ఞాపకశక్తికి సంబంధించి కొన్ని నిర్దిష్టమైన ఆహారనియమాలు పాటించవలసి ఉంటుందని కూడా ఆయుర్వేదం సూచిస్తోంది. అవేంటంటే...
- సులువుగా అరిగే, ఒంట్లోని విషాలను హరించే ఆహారంతో శరీరంలో కఫ సంబంధ అవరోధాలు తొలగి, వాత మార్గాలు తెరుచుకుంటాయి. అలాగే ఇలాంటి ఆహారం పిత్త పనితీరును పెంచి, తత్ఫలితంగా జ్ఞాపకశక్తినీ, తెలివితేటలనూ పెంచుతుంది.
- కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు, నెయ్యి, నారింజ, క్యారెట్లు, నట్స్‌లతో కూడిన సమతులాహారం తీసుకోవాలి.
- జున్ను తినకూడదు. మాంసాహారానికి దూరంగా ఉండాలి.
- జ్ఞాపకశక్తి, తెలివితేటలను పెంచే వాత, పిత్త, కఫ దోషాల మధ్య సమతులం సాధించాలంటే బెల్లం లేదా తేనెలకు దీర్ఘకాలం పాటు ఆహారంలో చోటు కల్పించాలి.
- టీ, కాఫీలకు దూరంగా ఉండాలి.

హెల్త్ వెల్త్

నోటి దుర్వాసన ఎందుకు?



నోటి దుర్వాసన కేవలం నోటి శుభ్రతా లోపం వల్లనే కాదు! మరెన్నో అంతర్గత రుగ్మతల ప్రధాన లక్షణం కూడా! ఉదర కేన్సర్ కూడా నోటి దుర్వాసన ద్వారానే బయల్పడుతుంది. కాబట్టి మూల కారణాన్ని కనిపెట్టి, చికిత్స తీసుకోవాలి.


- **చిగుళ్ల వ్యాధి:** పెరియోడాంటైటిస్, జింజివైటిస్ అనే ప్రధానమైన చిగుళ్ల వ్యాధుల్లో నోటి నుంచి దుర్వాసన వెలువడుతుంది. ఈ సమస్యలు ఉన్నప్పుడు చిగుళ్లు వాచి, రక్తం, చీము కారుతూ ఉంటాయి. వ్యాధికారక బ్యాక్టీరియా చిగుళ్లలో తిష్ట వేయడమే ఇందుకు కారణం. ఈ లక్షణాలకు తోడు నోటి నుంచి భరించలేని దుర్వాసన వెలువడుతుంటే, చిగుళ్ల వ్యాధిగా భావించి దంత వైద్యులను సంప్రతించాలి.
- **ఎలర్జీలు:** గొంతులో దురద, ముక్కు దిబ్బెడ, కంటి నుంచి నీరు కారడం లాంటి ఎలర్జీలు ఉంటే వాటికి తోడు నోటి దుర్వాసన కూడా అనుభవంలోకి వస్తుంది. తెమడ చెడు సూక్ష్మక్రిములకు నెలవు. వాటి వల్ల నోటి దుర్వాసన మొదలవుతుంది. అలాగే ఎలర్జీలు ఉన్నప్పుడు నోరు ఎండిపోతూ ఉంటుంది. దీని ఫలితంగా కూడా నోటి నుంచి దుర్వాసన వెలువడుతుంది. ఈ దుర్వాసన వదలాలంటే తెమడ వదిలించుకుని, జలుబు, దగ్గులను మందులతో అదుపు చేసుకోవాలి.

గుడ్ ఫుడ్

మెంతులు మేలు!

మెంతులను నిల్వ పచ్చళ్లలో తప్ప వంటకాలలో పెద్దగా ఉపయోగించం. కానీ పిల్లలకు పాలిచ్చే తల్లులకు మెంతులు మేలు చేస్తాయి. పాల ఉత్పత్తిని పెంచి, పసికందుకు పాల కొరత తీరుస్తాయి.

పిల్లలకు పాలిచ్చే తల్లుల ఆహారంలో మెంతులను చేర్చడం మన దేశ ఆనవాయితీ. ఉత్తర భారతదేశంలో మెంతి లడ్లు, దక్షిణాదిన పొడులు, ముద్దల రూపంలో వాడుతూ ఉంటారు. ఈ సంప్రదాయం వెనక సైన్స్ దాగి ఉంది. ప్రసవించిన మహిళలకు మెంతులు ఎంతో ఉపయోగకరం. వారిలో పాల ఉత్పత్తిని పెంచుతాయని జంతువులు, మనుషుల మీద జరిపిన పలు పరిశోధనల్లో రుజువైంది. 'గ్యాలెక్టగోగ్' అనే పాల ఉత్పత్తికి తోడ్పడే మూలిక లేదా ఔషధంగా మెంతులను వర్గీకరించారు. ఈ విత్తనాల్లో ఉండే 'డయాస్జెనిన్' పాల ఉత్పత్తి జరిగే మామరీ గ్రంథులలోని కణజాలం పెరుగుదలకు, తోడ్పడుతుంది. ఫలితంగా పాలు త్వరితంగా, ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. ఇందుకోసం రోజుకు 10 విత్తనాలు తీసుకుంటే సరిపోతుంది.



రోజుకు ఒకటి లేదా రెండు మెంతి లడ్డను పాలిచ్చే తల్లులకు తినిపంచవచ్చు. వీటికి బెల్లం, శొంఠి, డ్రై ఫ్రూట్స్ నెయ్యి జోడించాలి. అయితే దక్షిణాది రాష్ట్రాల్లో మెంతి పొడికి, పసుపు, శొంఠి, బెల్లం, ఇతర మూలికలు చేర్చి ఉడికించి, హల్వా ఉండగా చేసి పరగడుపున తినిపించడం ఆనవాయితీ. ఒకవేళ బరువు పెరగకుండా మెంతుల మేలు అందుకోవాలనుకుంటే, మెంతులను రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఉదయం పరగడుపున తీసుకోవచ్చు. ప్రత్యామ్నాయంగా మెంతులను పొడి చేసి, తేనె లేదా గోరువెచ్చని నీళ్లతో కలిపి తీసుకోవచ్చు. అయితే గర్భిణులు మెంతులకు దూరంగా ఉండాలి. గ్యాలెక్టగోగ్ కోవకు చెందిన మెంతుల్లో యుటెరోటోనిక్ ఏజెంట్ ఉంటుంది. ఇది కండరాల సంకోచవ్యాకోచాలకు కారణమవుతుంది. కాబట్టి గర్భవిచ్ఛిత్తికి ఆస్కారం ఉంటుంది.

కెగెల్ ఎక్సర్‌సైజెస్

నడుము దృఢంగా!

కొన్ని వ్యాయామాలు అంతర్గత జీవక్రియలు, వ్యవస్థల పనితీరును క్రమబద్ధీకరిస్తాయి. దైనందిన జీవితానికి ఇబ్బంది పెట్టే స్వల్ప సమస్యలనూ పరిష్కరిస్తాయి. అలాంటి వాటిలో చెప్పుకోదగినవి 'కటి వ్యాయామాలు'!

కటికి సంబంధించిన కొన్ని వ్యాయామాలు స్త్రీపురుషులు ఇద్దరికీ ఉపయోకరమే! కటి ప్రదేశంలోని కండరాలు బలపడే ఈ వ్యాయామాలు చేయడం వల్ల మూత్ర వ్యవస్థకు సంబంధించిన కొన్ని సమస్యలు దూరమవుతాయి. మరీ ముఖ్యంగా తుమ్మినా, దగ్గినా మూత్రం లీక్ అయిపోయే ఇబ్బంది తొలుగుతుంది. స్త్రీలలో ప్రసవానంతరం తలెత్తే ఈ రకం సమస్య కటి వ్యాయామాలతో అదుపులోకి వస్తుంది. ఈ వ్యాయామాలను అమెరికాకు చెందిన స్త్రీల వైద్యులు 'ఆర్నాల్డ్ కెగెల్' కనుగొన్నారు కాబట్టి వీటికి 'కెగెల్ ఎక్సర్‌సైజెస్' అనే పేరొచ్చింది.

కెగెల్ వ్యాయామాలు అంటే?

ఈ వ్యాయామాలనే 'పెల్విక్ ఫ్లోర్' వ్యాయామాలు అని కూడా అంటారు. కటిలోని కండరాలను బిగదీసి, వదిలే ఈ వ్యాయామాలు రోజు మొత్తంలో ఎన్ని సార్లైనా చేయవచ్చు. సరైన ఫలితం దక్కడం కోసం కనీసం 3 నెలల పాటు వ్యాయామాలు చేయాలి. తేలికగా ఉండే ఈ వ్యాయామాలను రోజులో ఏ సమయంలోనైనా చేయవచ్చు. కూర్చున్నా, పడుకుని ఉన్నా కూడా ఈ వ్యాయామాలు చేయవచ్చు. తింటున్నప్పుడు, కుర్చీ మీద కూర్చుని పని చేసుకుంటూ, టివి చూస్తూ విరామంగా ఉన్నప్పుడు కూడా చేయవచ్చు.

ఆరోగ్య ప్రయోజనాలు

- విసర్జక వ్యవస్థ అదుపులో ఉండేందుకు ఈ వ్యాయామాలను స్త్రీపురుషులు ఇద్దరూ చేయవచ్చు.
- శస్త్రచికిత్సల తదనంతరం కండరాలను బలోపేతం చేయడం కోసం ఈ వ్యాయామాలను అనుసరించాలి. ప్రోస్టేట్ సంబంధిత శస్త్రచికిత్సల తదనంతరం పురుషులు, పునరుత్పత్తి వ్యవస్థల సంబంధిత శస్త్రచికిత్సల అనంతరం స్త్రీలు ఈ వ్యాయామాలను చేయాలి.
- వృద్ధాప్యం మూలంగా బలహీనపడే కటి కండరాల బలోపేతానికి కూడా ఈ వ్యాయామాలు ఉపయోగకరం.
- ప్రసవం తదనంతరం మహిళలు ఈ వ్యాయామాలను క్రమం తప్పక చేస్తే పునరుత్పత్తి సంబంధిత అంతర్గత అవయవాలన్నీ తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి.
- మూత్రాశయం, దాని చుట్టుపక్కల కండరాలు ఈ వ్యాయామంతో బలపడతాయి. కాబట్టి చిన్న ఒత్తిడికే మూత్రం కారిపోయే పరిస్థితి ఉన్న స్త్రీపురుషులు ఈ వ్యాయామాలు ఎంచుకోవాలి.
- పొట్టలోని పేగులు పొత్తికడుపులోకి జారే సమస్య ఉన్నవారు కూడా ఈ వ్యాయామాలు చేయాలి.
- తెలియకుండా మలవిసర్జన జరిగిపోయే సమస్య ఉన్నవాళ్లకు కూడా ఈ వ్యాయామాలు ఉపయోగకరం.

ఇలా చేయాలి

ఈ వ్యాయామాలు చేసేటప్పుడు స్త్రీపురుషులు వేర్వేరు పద్ధతులు పాటించాలి.

- **సరైన కండరాలు:** మూత్రవిసర్జన చేయబోయి, ఆపుతున్నట్టు కండరాలను కదిలించడమే కెగెల్ ఎక్సర్‌సైజ్. మూత్రవిసర్జనతో సంబంధం ఉన్న కండరాలు బిగబట్టి, వదులు చేస్తూ ఉండాలి. అయితే సంబంధిత కండరాలేవో గ్రహించి, వాటిని మాత్రమే ఉపయోగించాలి. తర్వాత మూత్రవిసర్జన చేయడానికి వెళ్లినప్పుడు మూత్రవిసర్జనను మధ్యలో ఆపేయాలి. ఇలా చేస్తున్నప్పుడు ఏ కండరాలు మూత్రవిసర్జనను అదుపు చేస్తున్నాయో స్వయంగా గ్రహించగలుగుతారు. మహిళల్లో (యోని), మూత్రాశయం లోని కండరాలు బిగుసుకుని, పైకి లాగబడతాయి. ఈ కండరాలే మహిళలకు సంబంధించిన కటి కండరాలు. ఈ కండరాలే వ్యాయామం చేసే సమయంలోనూ బిగుసుకుంటూ ఉంటే వ్యాయామం సరిగా చేస్తున్నారని అర్థం. అలాగే తొడలు, పిరుదులు, పొత్తికడుపు కండరాలు ఈ వ్యాయామం చేసే సమయంలో విరామ స్థితిలో ఉండాలి.

వ్యాయామం ఇలా!

- మూత్రాశయం ఖాళీగా ఉంచాలి. పొట్టలో వాయువులు ఉండకూడదు.
- మీ సౌకర్యాన్ని బట్టి కూర్చుని లేదా పడుకుని వ్యాయామం చేయాలి.
- నెమ్మదిగా కటి కండరాలను బిగపట్టి, 10 అంకెలు లెక్కపెట్టి వదలాలి.
- వదిలిన తర్వాత మరో 12 అంకెలు లెక్కపెట్టి తిరిగి బిగపట్టాలి.
- వ్యాయామం చేస్తున్నంతసేపు, గుండెల్నిండా ఊపిరి పీల్చుకుని, శరీరాన్ని విశ్రాంత స్థితిలో ఉంచాలి. పొట్ట, తొడలు, ఛాతీ కండరాలు బిగదీయకూడదు. పొత్తికడుపు కండరాలు విశ్రాంతంగా ఉంచాలి.

ఈ వ్యాయామాలను క్రమం తప్పకుండా 4 నుంచి 6 వారాలపాటు చేయాలి. క్రమక్రమంగా కటికి సంబంధించిన సమస్యలు దూరమవుతాయి. అయితే ఈ వ్యాయామాలను అవసరానికి మించి చేయడం వల్ల మల,మూత్రవిసర్జన సమయంలో కండరాల నొప్పులు మొదలవుతాయి.



గమనిక

- ఈ వ్యాయామాలను సరైన పద్ధతిలో చేయని మహిళలకు లైంగిక కలయిక సమయంలో ఇబ్బందులు తలెత్తవచ్చు.
- ఈ వ్యాయామాలను చేస్తూ, కొంతకాలం తర్వాత ఆపిన మహిళల్లో తిరిగి మూత్రం కారిపోయే సమస్య తలెత్తే వీలుంది. కాబట్టి ఎక్కువ కాలంపాటు ఈ వ్యాయామాలు చేయాలి.
- ఈ వ్యాయామాలు చేయడం మొదలుపెట్టిన చాలా కాలం తర్వాత మాత్రమే మూత్రం కారడం, మలవిసర్జన సమస్యలు అదుపులోకి వస్తాయి.

వైద్యులను కలవాలి

- ఈ వ్యాయామాలను సక్రమంగా చేస్తున్నారో, లేదో తెలుసుకోవడం కోసం వైద్యులను కలవడం అవసరమే! వైద్యుల సూచనల మేరకు వ్యాయామాల మీద పట్టు సాధించి సాధన చేయడం ద్వారా కటి సంబంధ కండరాల బలహీనతతో తలెత్తే ఇబ్బందులను అధిగమించవచ్చు.

'ప్రజావాణి' అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 26: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్‌కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులను సమన్వయపరిచి ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 50 దరఖాస్తులు వచ్చాయి. గ్రీవెన్స్‌డే కార్యక్రమానికి కట్టంగూరు నుంచి వచ్చిన అంగవైకల్యం గల ఏర్పుల వెంకన్న అనే వ్యక్తికి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి హౌసింగ్ పీడీ రాజకుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, డీఈవో బిక్షపతి, స్త్రీ, శిశు, వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి బి. సక్కుబాయిలు కలిసి ట్రైసైకిళ్లను అందజేశారు.

నాయకులు గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 26: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ నాయకులు పనిచేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రతి గడపకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజారమేష్, పార్లమెంట్ ఇన్‌చార్జి రాంసింగ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించడానికి అమలుచేస్తున్న పథకాలు, ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, జహంగీర్, నవీన్, సిద్దార్థ, శంకర్, వంశీ, నందిని, అజారుద్దీన్, ఇర్ఫాన్, రబ్బానీ, బాసి త్, దాసరి విజయ్, నరేష్, పవన్‌కుమార్, సుల్తాన్, సాయిరాం పాల్గొన్నారు.

వేణుగోపాలునికి హనుమంత సేవ



ఉత్సవమూర్తులను మంటపానికి తీసుకువస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 26: హరిహరక్షేత్రం గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రుక్మిణి సత్యభామ సమేత వారిజాల వేణుగోపాలస్వామికి హనుమంత సేవ నిర్వహించారు. ఉదయం ఆలయ మహామంటపంలో హోమం, బలిహరణం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన హనుమంత వాహనంపై రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులను ఆసీనులను చేయించారు ఆలయ వీధుల్లో ఊరేగించారు. స్వామివారి హనుమంత సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకలో ఆలయ అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, రాజేశ్వరి దంపతులు, ఆలయ సిబ్బంది సింహాచలం, వేణు, మచ్చగిరి, నాగరాజు, నాయకుడు నర్రా నర్సిరెడ్డి పాల్గొన్నారు.

రైల్వే అండర్ పాస్ ప్రారంభం



రైల్వే అండర్‌పాస్ ప్రారంభంలో రైల్వే అధికారులు, నాయకులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 26: నార్కట్‌పల్లి నుంచి బీ.వెల్లెంలకు దారిలో నడికుడి - సికింద్రాబాద్ రైల్వేట్రాక్‌కు నిర్మించిన ఆర్‌యూబీని సోమవారం ప్రారంభించారు. దేశవ్యాప్తంగా రైల్వే అండర్ పాస్‌లను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించగా నార్కట్‌పల్లిలోని అండర్‌పాస్‌ను కూడా రైల్వే అధికారులతో కలిసి బీజేపీ నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొర్వి శంకర్, నాయకులు మునుకుంట్ల గణేష్, రమేష్, పరమేష్, గణేష్, శివ, రాములు పాల్గొన్నారు.

'రింగు అలవి వలలను నిషేధించాలి'



సాగర్‌పైలాన్ కాలనీలో సమావేశమైన మత్స్యకారులు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 26: నాగార్జునసాగర్ జలాశయంలో ఇకపై రింగు అలవి వలలు నిషేధించాలని మత్స్యకారులు తీర్మానం చేశారు. సాగర్ జలాశయం పరిసర ప్రాంతాల్లో చేపల వేట చేస్తున్న జాలర్ల సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులతో సాగర్ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు కారే రమణ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ పైలాన్ కమ్యూనిటీ హాల్లో సోమవారం సమావేశమయ్యారు. రింగు అలవి వలలతో చేపల వేట కొనసాగించకూడదని తీర్మానించారు. రింగు వలలతో చేపల వేట ఫలితంగా జలాశయంలోని 40 అడుగుల లోతు ఉన్న మత్స్య సంపదంతా ఒకేసారి ఖాళీ చేస్తుందని పేర్కొన్నారు. నేటి మత్స్యకార కుటుంబాలు జీవనం కొనసాగించాలనే ఈ రింగు వలల నిషేధానికి తీర్మానం చేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో రైట్ బ్యాంకు అధ్యక్షుడు కారే ముసలాయ, కంబాలపల్లి నరేష్, పెద్దగట్టు మురళి, బంగారి, రవి, కందాల తాతారావు, డైరెక్టర్లు విజయ్ పుష్పాటి, శివ, యేసు, అప్పారావు, నాగరాజు, నూకరాజు, సత్యరావు, అప్పారావు, శ్రీను, రమణ, అప్పలరాజు, సత్యారావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చింతపల్లి, ఫిబ్రవరి 26: చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 28 నుంచి మార్చి 14వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామస్వామి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఆదర్శ పాఠశాలకు చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 190, ద్వితీయ సంవత్సరంలో 193 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షకు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి విద్యార్థులు హాజరుకావాలని ఆయన కోరారు.

జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

• ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



జాతరలో భేరి వాయిస్తూ సందడి చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



శాలిగౌరారం: ఖడ్గం, త్రిశూలం పట్టుకుని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సామేలు

వేములపల్లి, ఫిబ్రవరి 26: గ్రామాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని బుగ్గబావిగూడెం సమీపంలోని గుట్ట పై గల యాదవుల ఆరాధ్య దైవమైన గంగమ్మ జాతరలో సోమవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే వివిధ గ్రామాల నుంచి యాదవులు భక్తులు కుటుంబ సమేతంగా జాతరకు తరలివచ్చి భేరి, డప్పు వాయిద్యాలతో కాళ్లకు గజ్జలు కట్టి ఊరేగుతూ అమ్మవారి వద్దకు చేరుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి నూతన వస్త్రాలు ధరించి బోనాలను ఎత్తుకొని గంగమ్మతల్లి ఆలయం చుట్టూ ప్రదిక్షణలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఎంపీపీ పుట్టల సునీత, తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ, ఆర్ఐ మహేందర్‌రెడ్డి, నాయకులు పుట్టల కృపయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, నాగవెల్లి మధు, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, రేగట్టె రవీందర్‌రెడ్డి, పుట్టల శ్రీనివాస్, పల్లా వెంకటయ్య, పిల్లల సందీప్, ఎస్‌కె.హాజి, కరుణాకర్‌రెడ్డి, మల్లయ్యయాదవ్, బాబయ్య పాల్గొన్నారు.

● **మిర్యాలగూడరూరల్:** ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకొని శాంతియుత జీవితాన్ని కొనసాగించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని సోమవారం చింతపల్లి, జప్తివీరప్పగూడెం గ్రామాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చింతపల్లిలో సీతారామ సమేత లక్ష్మణ, ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, జప్తివీరప్పగూడెంలో సీతారామచంద్రస్వామి ఆలయ భూమిపూజలో ఆయన పాల్గొన్నారు.

● **కనగల్:** మండలంలోని పగిడిమర్రి గ్రామంలోని శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయ, గోవిందాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి, రేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజున ఆలయం వద్ద అగ్నిగుండాలు కార్యక్రమాన్ని నిర్వహించారు.

● **పెద్దఅడిశర్లపల్లి:** పీఏపల్లి మండలంలోని దుగ్యాల గ్రామంలోని శ్రీ కోదండ రామాలయం దేవాలయంలో నూతన దేవాలయ పాలక మండలి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవాలయ చైర్మన్‌గా గుడిగోపురం నరేందర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు నర్రావుల బ్రహ్మానందరెడ్డి, ఆకనబోయిన శ్రీనివాసులు, ఆడెపు రాములమ్మ, కోమళ్ల వెంకటేశ్వర్లు, అర్చకులు శ్రీనివాసశర్మతో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి పాటుపడాలని, పదవి ఆకాంక్షతో కాకుండా దేవుడికి సేవచేయాలనే దృక్పథంతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాజు, రహీం, ముత్యాలు, పర్వతాలు, వెంకటయ్య, నర్సింహ, రాంరెడ్డి, పల్లె సత్యనారాయణ, ధర్మారెడ్డి, వెంకన్న, హోలీ, సలీం, ఆంజనేయులు, యాదగిరి పాల్గొన్నారు.

● **గుర్రంపోడు:** మండలంలోని చామలేడు గ్రామంలో పంచాయతన ఉమామహేశ్వర స్వామి దుర్గమ్మ, గౌరమ్మ గార్ల విగ్రహ ప్రతిష్ఠాపన ధ్వజస్తంభ ప్రతిష్ఠ స్వామివారి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు, బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ గాలి రవికుమార్, వెలగపురి కరుణాకర్‌రావు, కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, చినసత్తయ్య, సర్వయ్య, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **శాలిగౌరారం:** గ్రామ దేవతల పండుగలు భక్తి భావాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం శాలిగౌరారం మండలం తిరుమలరాయినిగూడెంలోని శ్రీ గంగదేవమ్మ ఆలయంలో జరుగుతున్న శివగంగ పంచమ బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బోనం ఎత్తుకుని ప్రదర్శన చేశారు. ఆలయ కమిటీ వారికి రూ.10వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల పండుగలతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు చింత ధనుంజయ్, వడ్లకొండ పరమేష్, ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పెంబళ్ల భిక్షం, చీమల మల్లయ్య, ఉపాధ్యక్షుడు సింగరి రాములు, కార్యదర్శి చిర్రబోయిన శ్రీనివాస్, పెద్దగొల్ల చీమల ఐలయ్య, సారెగొల్ల కడారి అంజయ్య, సభ్యులు బొల్లికొండ శ్రీరాములు, బొడ్డు పెద్దమల్లయ్య, చీమల రామస్వామి, లింగమల్లు, సత్తయ్య, కొమరయ్య, గణేష్, యాదగిరి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

● **గుర్రంపోడు:** మండలంలోని చామలేడు గ్రామంలో శ్రీశ్రీశ్రీ పంచాయతన ఉమామహేశ్వరస్వామి దుర్గమ్మ, గౌరమ్మ గార్ల విగ్రహ ప్రతిష్ఠాపన ధ్వజస్తంభ ప్రతిష్ఠ స్వామివారి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, ఎం పీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు, బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ గాలి రవికుమా ర్, వెలగపురి కరుణాకర్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, చినసత్తయ్య, సర్వయ్య, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

● **శాలిగౌరారం:** మండలంలోని గురజాల గ్రామంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథేశ్వర స్వామివారి ఆలయానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దర్శించుకుని నూతన ఆలయ నిర్మాణానికి రూ.50వేలు విరాళాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారం వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ నక్క శంకరమ్మమల్లేష్, మాజీ ఎంపీటీసీ కోక యాదయ్య, మాజీ సర్పంచ్ గూని మల్లయ్య, నాయకులు ఖమ్మంపాటి వీరయ్య, చినవెంకన్న, యాదయ్య, యుగంధర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భైరవనిబండలో శివరాత్రి సందర్భంగా జరిగే శ్రీ గంగాభవాని ఉమా మహేశ్వర సమేత బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను కిరణ్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దండ యాదగిరిరెడ్డి, నాయకులు దండ అశోక్‌రెడ్డి, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.



కిరణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

మిర్యాలగూడ, ఫిబ్రవరి 26: విద్యార్థులు శాస్త్రీయ దృక్పదాన్ని పెంపొందించుకోవడం వల్ల సమాజంలో మూఢత్వాన్ని పారదోలవచ్చునని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఆయన బహుమతి ప్రదానం చేసి మాట్లాడారు. మూఢ నమ్మకాల నిర్మూలనకు జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కొన్ని మూఢనమ్మకాలు సమాజ ఉన్నతికి అవరోధంగా పరిణమిస్తాయన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆలోచనలో సహేతుకమైన అభిప్రాయాల గురించి వివరించాలన్నారు. శాస్త్రీయ విజ్ఞాన ప్రాముఖ్యతను చాటిచెప్పే విధంగా ఆర్టిస్ట్ విజయ్ ప్రదర్శించిన చిత్రాలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండల్‌రెడ్డి, సామాజికవేత్త జాడిరాజు, సమూహ రైటర్స్ ఫోరం కస్తూరి ప్రభాకర్, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్‌రెడ్డి, సింధు, గాయకుడు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

● **మిర్యాలగూడ టౌన్:** క్రీడాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తానని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. క్లియో స్పోర్ట్స్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. విద్యార్థులను ప్రోతహిస్తూ ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ, రవికిర ణ్, నరేందర్, హర్ష, ఈశ్వర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 26: విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ పుల్లెంల సైదులు అన్నారు. మండలకేంద్రంలో రూ.2.20 కోట్లతో నిర్మించనున్న కేజీబీవీ కళాశాల భవన నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర అభివృద్ధి పై దృష్టి సారించి అన్ని రంగాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కళాశాల నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నాణ్యతాప్రమాణాలు పాటించి కళాశాల నిర్మాణాన్ని చేపట్టాలని అన్నారు. కళాశాల నిర్మాణం పూర్తయితే మండల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఈఈ శైలజ, ఏఈ జగన్, కాంట్రాక్టర్ లింగారెడ్డి, రాఘవరెడ్డి, కట్టా సిద్దార్థరెడ్డి, ఎరుకల వెంకన్న, ఆరూరి నరేష్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల హెల్పర్లకు పదోన్నతి కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ హెల్పర్లు

నల్లగొండ టౌన్ ఫిబ్రవరి 26: అంగన్‌వాడీ హెల్పర్లకు ఎస్ఎస్‌సీ అర్హతతో పాత పద్ధతిలో పదోన్నతి సౌకర్యం కల్పిస్తూ వయో పరిమితి 50 సంవత్సరాల వరకు పరిమితి ఉండే విధంగా చూడాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె. విజయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌తో పాటు జిల్లా సంక్షేమ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీశిశు సంక్షేమ శాఖ ఇటీవల కాలంలో ఐసీడీఎస్‌లో 9వేల అంగన్‌వాడీ ఉద్యోగుల పోస్టులు ఖాళీ ఉన్నాయని ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తే వెంటనే భర్తీ చేస్తామని ప్రకటించడం సంతోషకరమన్నారు. అయినా ఇదే సమయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పదోన్నతుల్లో విద్యార్హతను ఎస్ఎస్‌సీ నుంచి ఇంటర్‌కి మార్చడం విచారకరమన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకొని పాత పద్ధతిలోనే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులు దండెంపల్లి సత్తయ్య, ఏర్పుల యాదయ్య, నాయకులు అద్దంకి నరసింహ, పోలే సత్యనారాయణ, యూనియన్ నల్గొండ ప్రాజెక్టు అధ్యక్షురాలు పి.సరిత, వర్కింగ్ ప్రెసిడెంట్ కే.సునంద, హెల్పర్స్ సుజాత, భానుచంద్ర, అండాలు, రేవతి, వెంకటమ్మ, యాదమ్మ, ఇందిరా, ఎల్లమ్మ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎస్పీ చందనాదీప్తి



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ చందనాదీప్తి

చిట్యాల, ఫిబ్రవరి 26: క్రీడలు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్పీ చందనా దీప్తి అన్నారు. చిట్యాలలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో సోమవారం స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు ఎన్నో విషయాలు నేర్పుతాయని, క్రమశిక్షణను అలవరుస్తాయన్నారు. ఓటమి చెందితే నిరాశ చెందవద్దని, రెట్టించిన పట్టుదలతో గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించడానికి నిజాయతీగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సింహ, ఎస్ఐ సైదాబాబు, పాఠశాల చైర్మన్ బండి వీణ అనిల్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్‌రెడ్డి, మురళి, పోలా గోవర్ధన్, గంగాపురం రాము, బిర్రు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలి

అడవిదేవులపల్లి, ఫిబ్రవరి 26: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో పి.కరుణాకర్‌రావు సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని గోన్యాతండా, చాంప్లాతండా, కొత్తనందికొండ గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా ప్రతీ రోజు నీటిని పోయాలని, ఎండిపోయిన మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో మంచినీటి పైపులైన్ లీకేజీలకు, చెడిపోయిన బోర్లకు మరమ్మతులు త్వరగా చేపట్టాలన్నారు. తాగునీటి కొరత ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో మోసిన్‌అలీ, సిబ్బంది ఉన్నారు.

విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలి

• మార్చి 1న అస్సాం సీఎం హేమంత్‌బిశ్వాస్ రాక

నల్లగొండ, ఫిబ్రవరి 25: నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఉంటుందని తెలిపారు. ఈ నెల 28నుంచి మార్చి 1వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 28న జిల్లాలోని డిండి వద్ద విజయసంకల్ప యాత్రను ప్రారంభించనుండగా అదేరోజు మధ్యాహ్నం దేవరకొండ, సాయంత్రం హాలియాలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు నిర్వహించనున్నట్లు తెలి పారు. ఈ నెల 29వ తేదీన మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో యాత్రలతో పాటు సభలు సమావేశాలు జరుగుతాయన్నారు. మార్చి 1న సాయంత్రం నల్లగొండలో 10 వేల మందితో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నల్లగొండలో జరిగే సభకు అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వాస్ హాజరవుతారని అన్నారు. ఈ యాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, డీకే అరుణ, ఈటల రాజేందర్ పాల్గొంటారని తెలిపారు. రోడ్డుషోలతో పాటు మహిళల సమ్మేళనాలు, బైకు ర్యాలీలు, స్ట్రీట్ మీటింగ్‌లు కూడా ఉంటాయని తెలిపారు.

భార్యాభర్తలిద్దరికీ డాక్టరేట్

మునుగోడు రూరల్, ఫిబ్రవరి 26: మునుగోడు మండలంలోని సింగారం గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ఐదు రోజుల క్రితం కుమరస్వామి డాక్టరేట్ పట్టా పొందగా, సోమవారం శ్యామల డాక్టరేట్ అందుకున్నారు. కుమారస్వామి లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ సబ్జెక్టులో డాక్టరేట్ పట్టా పొందగా, శ్యామల కూడా సోషల్ వర్క్‌లో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా పొందారు. ఆమె నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ధీరజ పర్యవేక్షణలో మహబూబ్‌నగర్ జిల్లాలో 'బాలికల యొక్క చదువుపై సామాజిక ఆర్థిక పరిస్థితుల ప్రభావం' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

సంక్షిప్త సమాచారం...

శాలిగౌరారం: శాలిగౌరారం తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎండీ అన్వర్ హుస్సేన్‌ను కాంగ్రెస్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బెల్లి వీరభద్రం, ధనుంజయ్, నర్సింహ పాల్గొన్నారు.

నల్లగొండటౌన్: ఉపాధ్యాయుల పదోన్నతులపై కోర్టులో ఉన్న స్టేను వెకెట్ చేయడంపై టీఎస్ యూటీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం తెలిపారు. హైకోర్టులో మల్టీజోన్ -2 హెచ్‌ఎంల పదోన్నతుల కేసులో సుదీర్ఘ వాదనల అనంతరం స్టే వెకేట్ చేయటానికి న్యాయమూర్తి అంగీకరించడం శుభపరిణామమన్నారు.

అడవిదేవులపల్లి: మండలకేంద్రానికి చెందిన పసుపులేటి శ్రీనివాస్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్ తెలిపారు.

మాడ్గులపల్లి: ఎంపీడీవోగా విధులు నిర్వహించి బదిలీపై భువనగిరి వెళ్తున్న దండా జితేందర్‌రెడ్డికి ఎంపీడీవో కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించి సన్మానించారు. ఎంపీడీవోగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లడంతో పలువురు అధికారులు సత్కరించారు.

కొండమల్లేపల్లి: ఈ నెల 28 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నందున పరీక్ష సమయాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జీరాక్స్ కేంద్రాలను విధిగా మూసి ఉంచాలని ఎస్ఐ రామ్మూర్తి సోమవారం తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

మిర్యాలగూడరూరల్: గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన ఏర్పాటు చేశారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో గ్రామీణ వ్యవస్థ పాలన అస్తవ్యస్తంగా మారుతుంది. మండలంలోని అవంతీపురంలో నెలల తరబడి డ్రైనేజీలు, పారిశుద్ధ్యం తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిడమనూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తక్షణమే రేషన్‌కార్డులు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. రేషన్‌కార్డుల గురించి సోమవారం తహసీల్దార్ జంగాల కృష్ణయ్యకు పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఏళ్ల తరబడిగా ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

చింతపల్లి: చింతపల్లి మండల కేంద్రంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు ఉపాధ్యాయులుగా అబ్బురపరిచారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుగుణ, అంగన్‌వాడీ టీచర్ పద్మావతి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: ఆపదలో ఉన్న తోటి విద్యార్థుల కుటుంబాలను పూర్వవిద్యార్థులచే ఏర్పాటైన స్వాన్ (స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ నార్కట్‌పల్లి) సంస్థ ఆర్థిక సాయంతో ఆదుకుంది. నల్ల నవీన్ అనే యువకుడు ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా స్వాన్ సభ్యులు రూ.40 వేలు అతని కుటుంబానికి అందజేశారు. అదేవిధంగా కల్లుగీస్తూ తాటిచెట్టు పైపడి గాయపడిన పనస మల్లేశ్‌కు రూ.21వేలు, రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న జాల శివకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని మూలమూర్తి వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చామలను అర్చక స్వాములు ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. స్వామి వారి ఆశీస్సులతో రాష్ట్రం, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నానని ఆయన తెలిపారు.

దేవరకొండ: దేవరకొండ, కొండమల్లేపల్లి ఆటో యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవరకొండ, కొండమల్లేపల్లి ఆటో యూనియన్ అధ్యక్షుడిగా ఎండి.జానిబాబా, ఉపాధ్యక్షుడుగా మంకూరి చిన్నరాజు, యాదయ్య, ప్రధానకార్యదర్శిగా మూడావత్ సూక్య, సహాయకార్యదర్శులుగా తోటపల్లి నరేష్, సాంబ, కార్యనిర్వాహణ కార్యదర్శిగా మల్లేష్, కోశాధికారిగా వెంకన్నతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

దేవరకొండ: విద్యార్థులు ఇష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని బీసీ పొలిటికల్ యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌లో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ధనలక్ష్మిబాలనారాయణగౌడ్‌ల సహకారంతో అందజేసిన పరీక్ష ప్యాడ్లను ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కట్టంగూరు, ఫిబ్రవరి 26: కట్టంగూరు మండలంలోని అయిటిపాముల గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దానబోయిన నర్సమ్మ ఈ నెల 21వ తేదీన ఇంటికి తాళం వేసి అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లో ఉన్న తన పెద్దకొడుకు వెంకటేష్ వద్దకు వెళ్లింది. తిరిగి ఈనెల 25 సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించింది. లోనికి వెళ్లి చూసేసరికి బీరువా తెరిచి ఉంది. బీరువాలోని ఉంచిన రూ.2లక్షల నగదు, రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, 26 తులాల వెండి పట్టా గొలుసులను దొంగలు అపహరించారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దేవరకొండ, ఫిబ్రవరి 26: మండలంలోని తాటికోలు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. తాటికోలు గ్రామ వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా అవుతుందన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి ఇద్దరు డ్రైవర్లు నర్సింహ, రాములుపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.